**శ్రీ రమణ జ్యోతి** **Sri Ramana Jyothi**

ఆగష్టు 2021 August 2021

ఈ సంచికలో ... IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 85వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **అందరూ ఆత్మాన్వేషణలోనే ఉన్నారు** | దోనెపూడి వెంకయ్య | 11 |
| **3.** | **శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్)** | జి. శ్రీహరిరావు | 16 |
| **4.** | **భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు** | పి. వెంకట్రామ శర్మ | 19 |
| 5. | Observing Every Breath You Take | Dr. K. Subrahmanian | 30 |
| 6. | Kavyakantha's Chatvarimsat | V. Krithivasan | 41 |
| 7. | How I came into the fold of Sri Bhagawan | Smt. G. Naga Rajeswari | 43 |
| 8. | Parechcha Karma | | 50 |

**Events in Sri Ramana Kendram in August/September 2021**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 7th August - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
4. 1st September - Bhagavan's Advent Day
5. 3rd September - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.

(Devotees may please note that due to social distancing, *satsangs* are being held online. For details, please contact Kendram Office)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# గురువు స్వేచ్ఛను ఇస్తారు

డా॥ కే.యస్. గారి 85వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

తమ నమ్మకాన్ని బట్టి ఒక్కొక్కొరు ఒక గురువును స్వీకరి స్తుంటారు. ఈ కేంద్రంలో మనం భగవాన్ శ్రీరమణమహర్షిని గురువుగా భావించి, వారికి సంబంధించిన ఆధ్యాత్మిక విషయాలపై భాషణలు, చర్చలు, ప్రవచానలతో సత్సంగం జరుపుకుంటాం. గురువులు అందరూ సమానమే అయినప్పటికీ, ఒక గురువు చేత ఆకర్షింపబడి ఆయనను అనుసరించడం జరుగుతుంది. ఒకరిని అనుసరిస్తున్నప్పుడు మరొకరి శిష్యులమంటూ భావించడం అనవసరం. దాని ఉద్దేశమేమిటంటే, మనసులో ఎలాంటి పరస్పర విరుద్ధతను ఏర్పరుచుకోకూడదు. సాధారణంగా ఎవరైన నా దగ్గరికి అలవాటుగా ఒక పదిరోజుల పాటు వచ్చి, తరువాత రాకుంటే, అహం కారణంగా కలవరపాటు చెందుతాం. మహర్షి, జ్ఞానులు అలాంటివారు కారు. ఎవరినీ తమతో బంధించి వుంచుకోవాలని అనుకోరు. అలాగ తలచేవారు గురువు కారు, నా వద్దకు వస్తూనే వుండకపోతే చెడిపోతావని ఎప్పుడూ అనరు.

## స్వేచ్ఛ ఇవ్వడం సబబు

తనను సంప్రదించకుండా తన పుత్రుడు ఏ నిర్ణయాన్నీ తీసుకోడు అని చెప్పే తండ్రిని 'మంచి' తండ్రి అనలేము. ఇరవై ఐదు, ఇరవై ఆరు ఏళ్ళ కొడుకు నన్ను అడగకుండ నిర్ణయం

తీసుకుంటాడని భావించే తండ్రి సరియైన వ్యక్తి. సాధారణంగా తలెత్తే సమస్యలకు మూలకారణం తాము లేకుండ ఇతరులు మనలేరన్న భావనే. అలాగే ఇతరులు తనపై ఆధారపడి వుండాలని కూడ చాలామంది కోరుకుంటారు. అది మంచిది కాదు. ఎందుకంటే ఎప్పుడో ఒకప్పుడు, తాను వెళ్ళిపోయినప్పుడు పరిస్థితి ఎలా వుంటుంది.

తాము స్వేచ్ఛగా వున్నవారే ఇతరులకు స్వేచ్ఛను ఇస్తారు. అలాగని ఏమీ పట్టనట్లు వుండడమని కాదు. తనలాగే పిల్లలకు స్వేచ్ఛను ఇచ్చి, తన సలహాను కోరినప్పుడు తగిన విధంగా స్పందించవచ్చు. వారు దాన్ని ఎలా ఆచరిస్తారన్నది వేరు విషయం. నా తరువాత కొడుకు, లేదా కూతురు సలహా వినకుంటే ఏమౌతారు అన్న ఆలోచన అనవసరం. వారికి ఏది మంచిది అనుకొంటామో దాన్ని చెప్పడమే మన విధి, పాటించడం, పాటించకపోవడం వారి యిష్టం. ఒక్కొక్కసారి అసలు దేవుడున్నాడా అన్న ఆలోచన వస్తుంది. ఆ అనుమానం కూడ ఆయనే కలిగిస్తాడు. మానవ మాత్రుడెప్పుడూ ఆ అపనమ్మకాన్ని కలిగించలేడు. ఆ స్వేచ్ఛ కూడ ఆయనే ఇస్తాడు. భగవంతుడు, జ్ఞాని, మహర్షి అలాంటి స్వతంత్రాన్ని ఇవ్వగలరు. మీరూ అలాంటి స్వేచ్ఛ ఇతరులకు ఇవ్వాలి. రమణ కేంద్రం భక్తులు స్వేచ్ఛను అనుభవించాలి. ఎవరు చెప్పినదో విని తీరాలన్న భావన వుండకూడదు.

ఒకసారి స్వామి వివేకానంద అల్మోరాకు వెళ్ళినప్పుడు ఆ స్థలం యొక్క అందానికి ముగ్ధుడైపోయాడు. అక్కడ ఒక అద్వైత

ఆశ్రమం వుంటే బాగుంటుందన్నాడు. సన్యాసులు అక్కడికి వెళ్ళి ధ్యానం చేసుకోవచ్చు నన్నాడు. అందులో శ్రీరామకృష్ణ పరమహంస పటాన్ని చూశాడు. దాన్ని తొలగించమని చెప్పాడు. ఆ స్థలంలో మరేదీ వుండరాదు. కేవలం ఆ పరాత్పరుని గురించిన ధ్యానం మాత్రమే అక్కడ జరగాలన్నారు. ఆ విషయాన్ని ఎవరో శ్రీ శారదా దేవికి చెప్పారు. ఆమె అతను (స్వామి) మంచి పని చేశాడన్నారు. ఆ చోట సన్యాసులు నిరాకార రూపంపై ధ్యానం చేసేవారు. న కర్మణా ... వభ్రాం విపారం పరమేశ్వ భూతం ... పరస్స మహేశ్వరః

కొంతకాలం తరువాత ఒక ఏడాది పాటు వివేకానందుడు అక్కడికి తిరిగి వెళ్ళడం జరగలేదు. ఆ సమయంలో అద్వైత ఆశ్రమం మొత్తం దేవి, దేవతల ఫోటోలు, రామకృష్ణుల వారి ఫోటోతో సహా కనిపించాయి. కొందరు వాటిని తీసెయ్యమని ఎందుకు చెప్పలేదని అడిగారు. ''నేను ఒకసారి చెప్పాను. వాళ్ళింకా సిద్ధంగా లేరు. ఇక చెప్పదలచు కోలేదన్నారు. అంతే. తమ మాటను ఎందుకు వినలేదని బలవంత పెట్టను. వాళ్ళు సన్న్యాసులు, ఇంకా సమయం ఆసన్నం కాలేదన్నారు. అద్వైత ఆశ్రమంలో ఫోటోలన్నీ అలాగే వున్నాయి.

## సలహా ఇవ్వడం వరకే బాధ్యత

అప్పుడప్పుడు ఆశ్రమంలోని సాధకులు తమకు మంచి సలహా, సూచనను ఇమ్మని ప్రార్థించేవారు. భగవాన్ మాత్రం ఆ విషయంలో తటపటాయించే వారు. మరీ బలవంతపెడితే, ఏదో ఒకటి

చెప్పేవారు. "సలహా అడిగారు కదా, మరెందుకు అలా నడుచు కోలేదని ప్రశ్నించేవారు కాదు". సాధారణంగా మనం ఇతరులను సలహా కోరినప్పుడు, మనకు అనుకూలంగా జవాబు వస్తుందని తలుస్తాము. నిజానికి, అలా సలహా అడగడం కాదు, మనం ఏది సరియైనది అనుకుంటామో వారు అలా చెబుతారని అనుకుంటాము. అలాగ ఒకరి నుండి మరొకరికి తాము ఆశించే జవాబును కోరుకుంటారు. కష్టమౌతుందని ఇతర రకాల సలహాలను పాటించడానికి ఇష్టపడం. అలాంటిది మరేమీ చేయనవసరం లేదు గనుక అలాంటి గురువును అన్వేషిస్తాము. అంటే మనం తెలుసుకోవాలన్న విషయాన్ని యథార్థంగా కోరడం లేదన్న మాట.

## గురువే ఎన్నుకొంటాడు

అందుకే మన ఋషులు, జ్ఞానులు, గురువును వ్యక్తి ఎన్నుకొనడం కాదు, గురువే మనల్ని నిర్ణయిస్తారనే వారు. కాని, మానవ బలహీనతల కారణంగా ఎవరు సులభంగా వ్యవహరిస్తారో వాళ్ళు నచ్చుతారు. ఏమైనా సరే, హైదరాబాదు రమణ కేంద్రం మాత్రం కొందరు భక్తులు మాట్లాడడం, ఇతరులు వినడం జరుగుతుంది. ఇక్కడి సభ్యుల్లో ఎందరికో ఎన్నో అనుభవాలు వుంటాయి. ఎవరికైనా తాము చదువుకున్న, లేదా తెలిసిన ఉపయోగకర విషయాలను ఏ సందిగ్ధం లేకుండ మాట్లాడడం మంచిది. ఇది ఏదో చిన్న విషయం కాదు.

యూ.కే. లో 'లిబర్టీ హాల్' అని ఒకటి వుంది. అందులో సభ్యులు తమ స్వేచ్ఛా మనసుతో, అక్కడ ప్రవర్తిస్తారు. శ్రీరమణ కేంద్రం కూడ అలాంటి ప్రదేశం కావాలి. భగవాన్ తోడ్పాటు వాళ్ళకు ఎప్పుడూ వుంటుంది. అలాగ ఎంతోమంది ద్వారా ఎన్నో అంశాలు అందరికీ తెలియ వస్తాయి. కాని ఎవరూ తాము ఎన్నుకోబడిన వారని భావించరాదు. ఎన్నుకొనడం ప్రభువు వంతు. ఇక్కడ వచ్చే చాలా మందిలో ఎన్నో అనుభవాలు వుండి తీరతాయి. కాని వాటిని బైటపెట్టరు. ఇతరులతో వాటిని పంచుకొనడం ఎంతో మంచిది, అవసరం కూడా.

ప్రతి ఒక్కరికి అనుమానాలు, అపనమ్మకాలు వుండడం సహజం. అలాంటి వాటి కారణంగా ఆ కొన్నింటిని ముందుగానే అసాధ్యాలనుకుంటాము. కాని అసాధ్యాలనుకున్నవి సాధ్యమయ్యే అవకాశాలుంటాయి. ఉదాహరణకు ఆరునెలల క్రితం, కొంత కాలం పరిచయమైన వ్యక్తి నన్ను సమీపించి "నా దగ్గర వున్న కొంత ధనంతో ఉపయోగకరమైన పని ఏదైనా చేద్దామనుకున్నాను. ఆ డబ్బు మీకిస్తాను, ఎలా వినియోగించ దలచుకున్నారో చెప్పండి, ప్రశ్నించను" అన్నాడు. అప్పుడు ఒక అనుకోని సందర్భం ఏర్పడింది. నేను మారేడుపల్లిలోని శంకర విద్యాలయ అన్న పాఠశాలకు అప్పుడప్పుడు వెళ్తుండేవాడిని. అక్కడి విద్యార్థినీ విద్యార్థులు బహు పేద కుటుంబాలకు చెందినవారు. పాత, చినిగిన దుస్తులతో క్లాసులకు రావడం చూశాను. వారికి తగిన 'యూనిఫాం' (దుస్తులు) ఏర్పాటు చేస్తే బాగుంటుందనిపించేది. ఆ విషయాన్ని ఆ దాతకు

తెలిపి, తాను ఇచ్చే సొమ్ముతో, గుడ్డకొని దుస్తులు కుట్టిస్తామన్నాను. కాని ఇక్కడే అనుకోని అడ్డంకి ఏర్పడింది. కేంద్ర సాధకుల్లో ఒకరు పాండురంగం గారి సహాయంతో గుడ్డ కొని యూనిఫారాలు కుట్టించాలనుకుంటే ఇబ్బంది వచ్చింది. కాని అనుకోకుండ బెంగళూరు నుండి ఒకరు ఖర్చులో తాను భరిస్తానని తెలపడంతో ఆ పని విజయవంతంగా పూర్తి చేయగలిగాం. సమయానికి దుస్తులు తయారయ్యాయి.

దాతలు ప్రత్యేకంగా వచ్చి దుస్తులు పంచినప్పుడు, పిల్లల్లోని ఆనందం, తృప్తిని చూసి ఎంతో సంతోషించారు. సాధారణంగా శ్రీనాథ్‌గారు ఇచ్చే బిస్కట్లతో బాటు ఆ రోజున క్రొత్త దుస్తులు లభించడంతో, పిల్లలు ఆశ్చర్యంలో మునిగిపోయారు. మంచి రకం గుడ్డ వాడడంతో రూ.50 వేలు ఖర్చయింది. ఎవరినీ అడగకుండ అంత సహాయం లభించడం, అదీ అనుకోకుండ జరిగింది. అలాంటి సంఘటనలు ఎందుకు జరుగుతాయి. మనకు ఏది కావాలో భగవాన్‌కు తెలుసు. ఎవరినీ, ఏదీ అడగవద్దని భగవాన్ చెప్పేవారు. మీకు అవసరమైనది మీకు లభిస్తుంది. ఎవరినీ కోరనక్కర లేదనే వారు. అవసరాలు తీర్చబడతాయి. కాని దురాశ వేరు. ఆ భేదం గ్రహించాలి. మన జీవితాలలో అలా అవసరమైనవి లభించినప్పుడు దేవుడు ఎంతో దయామయుడనుకుంటాం. అది ఎక్కువ కాలం నిలువదు. మనం దానికి అర్హులం గనుక అవి లభించాయని భావించడం మొదలు పెడతాం.

## కావలసినది భగవాన్ కృప ఒక్కటే

అసలు మనం కేంద్రానికి ఎందుకు వస్తాం? మనసు యొక్క కలవరపాటును పోగుట్టుకునేందుకు వస్తాం. మనకు మానసిక ప్రశాంతత అవసరం. దానికి ఎన్నో విధాల ప్రయత్నిస్తాం. కాని ఆ శాంతి కొంత కాలం మాత్రమే వుంటుంది. మనం నిజంగా ఏది కోరుకుంటామో దాన్ని గురించిన అవగాహన ఒక్కొక్కరికి ఒక లాగున వుంటుంది. మనసన్నది పూర్తిగా లేని స్థితిని మనసు ద్వారా మనం ఊహించలేము. అందువల్ల అవగాహన పాక్షికంగా మాత్రమే వుంటుంది. మనం చేయవలసినది భగవాన్ కృపను కోరి ఆ తరువాత ఆయన దయా, దాక్షిణ్యాలకు వదిలి పెట్టడమే. మనం కోరినది లభించనప్పుడు నిరాశ చెందనక్కరలేదు. మనం ఊహించ లేని విధంగా అంత కంటే మెరుగైనది ప్రసాదించబడే అవకాశం వుంటుంది. ఏమైనా ప్రయత్నం చేసినప్పటికీ, పురోగతి, శాంతి ఏర్పడడం లేదనుకుంటారు. అలా భావించ పని లేదు.

మరొక విషయం గురించి కూడ చెబుతామనుకొంటున్నాను. 'నేను ఎవరు' అన్న విచారణతో బాటు మరొకటి కూడ భగవాన్ తెలిపారు. అది కొందరు, ముఖ్యంగా బౌద్ధ సన్న్యాసులు అభ్యసించేది. ప్రత్యేకంగా ఒక సమయం అంటూ కాకుండా, ఎప్పుడైనా, ఏ రోజైనా అభ్యసించగలిగేది. ఎవరి వద్దకూ వెళ్ళి నేర్చు కోవలసిన అవసరం లేనిది. అది శ్వాసకు సంబంధించినది. భగవంతుని సృష్టిలో ఒక అద్భుతమైనది. అందరం అసంకల్పితంగా

చేసే కార్యం. మన ఎఱుకలో లేకుండ జరిపే క్రియ. శ్వాసించ కుండా మనం జీవించలేము.

మనకు ఊపిరాడనప్పుడే శ్వాస గురించిన స్పృహ కలుగుతుంది. మీరు జరిపే ప్రతి యొక్క క్రియను మీరు తెలిసి, ఎఱుకతో చేయమని బుద్ధుడు బోధించాడు. నిటారుగా పద్మాసనంలోగాని మరేదైన సుఖాసనంలో కూర్చొని శ్వాస క్రియను ప్రారంభించండి. మీ ప్రతి ఉచ్ఛ్వాసను, నిశ్వాసను గమనించండి. ఇది చాలా సులభమనిపిస్తుంది. కాని కొన్ని క్షణాల పాటు మాత్రమే అలా ప్రత్యేక స్పృహతో చేయగలుగుతాం. అప్పుడు మనసు రంగంలోనికి వస్తుంది. బాహ్య విషయాలపై ధ్యాస మరలుతుంది. కాని పట్టుదలతో, శ్వాసపై మాత్రమే కేంద్రీకరించి, కనీసం ఐదు నిమిషాల సేపైన వుండగలిగితే దాని అసాధారణమైన ప్రభావం మీకే తెలియవస్తుంది.

**ఆత్మ సాక్షాత్కారము**

**నిరస్య విషయాసఙ్గం**
**మనోవృత్తిం వివర్జయేత్**
**యదా యాత్యున్మనీభావం**
**తదా తత్పరమం సుఖం ॥**

తా॥ విషయములయందలి చేరికను పోగొట్టుకొని మనస్సు యొక్క వ్యాపారమును వదులుకొనవలయును. ఎప్పుడు మనోరాహిత్యమును (తలంపు లేకపోవుటను) పొందుచున్నాడో, అప్పుడు ఆ యుత్తమ సుఖము (ఆత్మ సుఖము) కలుగుచున్నది.

# అందరూ ఆత్మాన్వేషణలోనే ఉన్నారు

దోనెపూడి వెంకయ్య

భగవాన్ శ్రీ రమణ మహర్షి 'అరుణాచల స్తుతి పంచకం' అనే భక్త్యుపదేశ గ్రంథాన్ని వ్రాశారు. ఇందులో ఐదు స్తోత్రాలు ఉన్నాయి. వాటిలో ఒకటి అరుణాచల అష్టకం. ఇందులోని ఎనిమిదవ గీతంలో వారు ఒక మాట చెప్పారు. అది ఏమిటంటే "సముద్రంలో నుంచి నీరు పైకి లేచి, మేఘంగా మారి కొండల్లోనే, కోనల్లోనో, అడవుల్లోనో, పట్టణాలలోనో ఎక్కడో వర్షంలా కురుస్తుంది. ఆ నీరు ప్రవహించి వాగులుగా వరదలుగా కొనసాగి తర్వాత ఒక మహా నదిగా మారుతుంది. తిరిగి సముద్రంలోనే చేరిపోతుంది. అది తప్పదు. వచ్చిన చోటుకే పోకుండా ఆ నీటిని ఆపడానికి ఎవరి తరమూ కాదు. ఎన్ని అడ్డుకట్టలు వేసినప్పటికీ కూడా దాన్ని ఆపడం సాధ్యం కాదు. అలాగే ఓ అరుణాచలేశ్వరా! లోకంలో జీవులు నీ నుండి వస్తారు. ప్రారబ్ధ వాసనా బలం చేత ఎన్నో జన్మలు ఎత్తుతారు. ఎన్నో మార్గాలు త్రొక్కుతారు. ఎన్నెన్నో త్రోవలలో వారు వెళ్లినప్పటికీ, ఏ విధంగా తిరిగినా కూడా, తిరిగి వారు నీ లోకే వచ్చి కలుస్తారు. దీన్ని ఎవరూ ఆపలేరు. ఆనంద సాగరుడవైన ఓ అరుణాచలేశ్వరా! ఏ జీవుడి కైనా ఎక్కడైనా ఇది తప్పదు. తన మూలమైనటువంటి నీ లోనికి వచ్చి కలిసి పోతాడు. సారాంశం ఏమిటంటే లోకంలోని జీవులందరూ కూడా పరమాత్మలో నుండే వచ్చారు. మరలా పరమాత్మ లోకే వెళ్తారు. వారిని ఆపడం

ఎవరి తరమూ కాదు.

అందుకే భగవంతుడు ఈ జీవుని లోపల ఒక వేదనను సృష్టించాడు. ఆ తహతహనే 'జీవుని వేదన' అంటారు. 'ఇది నాకు కావాలి, ఇది నాకు కావాలి' అని ఏదో ఒక అసంతృప్తి ప్రతి జీవుడిలో ఉంటుంది. 'I want this, I want that' అని అంటాడు. వేదాంత పంచదశిలో చెప్పిన వాక్యం - 'ఇదం మే స్యాత్, ఇదం మే స్యాత్' అని. ఇలా ప్రతి జీవునిలో ఒక దుఃఖం, ఒక ఆర్తి, ఒక తహతహ ఉంటుంది - ఏదో ఒకటి పొందాలని, ఏదో ఒకటి కావాలి అని. సచ్చిదానంద స్వరూపమైన పరమాత్మ నుండి వచ్చినటువంటి వాడు అయినప్పటికీ భ్రాంతి కారణంగా దేహాత్మ భావనా బద్ధుడై నందువలన అంతరాంతరాల్లో నేను ఆనందాన్ని పొందాలి అనే తహతహ ఉంటుంది. ప్రతి జీవుడు ఆనంద సాగరుడూ ఆనంద స్వరూపుడూ అయి ఉండి కూడా భ్రాంతి వల్ల ఆ విషయాన్ని గుర్తించలేక ఈ లోకంలో ఆనందాన్వేషణలోనే ఉంటున్నాడు. ఎందువలన ఆనందం వస్తుందో గమనించ లేకపోతున్నాడు.

ఆనందాన్వేషణ అంటే ఆత్మాన్వేషణమే! ఎందుకంటే భగవాన్ 'నేను ఎవడను' అనే గ్రంథం మొదట్లోనే 'ఎఱుక స్వరూపం ఏమిటి' అంటే 'సచ్చిదానందము' అని చెప్పారు. ప్రతి జీవుడూ ఎన్నో జన్మలలో వివిధ మార్గాలలో ఈ అన్వేషణ చేస్తూనే ఉన్నాడు.

కొంతమంది ఆరోగ్యం బాగుంటే ఆనందంగా ఉంటుంది, సుఖంగా ఉంటుంది అనుకుంటారు. కానీ ఆరోగ్యం నిత్యమైన

ఆనందాన్ని ఇవ్వలేదు. ఎందుకంటే జన్మ, మృత్యు, జరా, వ్యాధులు వస్తుంటాయి, పోతుంటాయి. వీటివలన లోపలి ఆనందానికి అవరోధం ఏర్పడుతుంది.

కొందరు ధన, కనక, వస్తు, వాహనాలను సమకూర్చు కోవడంలో తమ సమయాన్ని వినియోగిస్తుంటారు. ధనం ద్వారా ఆనందం కలుగుతుందనే భ్రాంతిలో ఉంటారు. కొన్నాళ్ళు అయిన తర్వాత ఆనందం కంటే దుఃఖమే ఎక్కువగా ఉందని వారికి అనుభవంలోకి వస్తుంది. ధనం పెరిగేకొద్దీ భయం ఎక్కువ అవుతుంది, ఆనందం తగ్గుతుంది. ఆరోగ్యం చెడిపోతుంది - అనేక కారణాల వల్ల.

మరికొందరికి పదవీవ్యామోహం ఉంటుంది. అధికారం వల్ల ఆనందం కలుగుతుందని వారు అనుకుంటారు. కానీ తద్వారా కూడా ఆనందాన్ని పొందలేకపోతారు, దుఃఖాన్నే పొందుతారు, అధికారం ఎప్పుడు పోతుందో అని భయం ఉంటుంది కనుక.

ఈ మార్గాలే కాకుండా స్త్రీ సాంగత్యం ద్వారా, కీర్తి సంపాదించడం ద్వారా, శాస్త్ర పాండిత్యం ద్వారా ఆనందం పొందుదామని అనుకుంటారు. ఆనందం పొందడం కోసం లలిత కళల్లో ప్రావీణ్యాన్ని సంపాదిస్తారు. తద్వారా రసానంద ప్రాప్తి కలుగుతుంది కనుక. ఈ రసానందము ద్వారా నిత్యమైన శాశ్వతమైన ఆనందాన్ని పొందగలమని అనుకుంటారు. ఇలా అనేక రకాలైన ఆలోచనలతో ఉంటారు.

ఈ రకంగా అనేకానేక త్రోవల్లో వెళ్ళి వెళ్ళి, దేనితోటి తృప్తి చెందక చివరకు ఒక గురువు యొక్క ఆశ్రయాన్ని సంపాదించి ఆధ్యాత్మిక మార్గంలోకి ప్రవేశిస్తాడు, జీవుడు. ప్రవేశించి అందులో కూడా కొన్నాళ్ళు కర్మయోగము, కొన్నాళ్ళు భక్తియోగము, కొన్నాళ్ళు రాజయోగము - ఇలా అనేక ఆధ్యాత్మిక సాధనలు చేపట్టి, లేకపోతే తీర్థయాత్రలు చేసి, ధ్యానాలు చేసి - వీటి ద్వారా ఆనందాన్ని పొందుదాము, ఆనంద స్వరూపమైన భగవత్ప్రాప్తిని పొందుదామని అనుకుంటాడు. అంతటితో ఆగదు - అందులో త్రిపుటి ఉంటుంది కనుక, కర్తృత్వ భావన ఉంటుంది కనుక, నేను కర్తను అనే భావన ఉంటేనే గాని ఏ సాధన చేయలేడు కనుక. చివరకు జ్ఞాన మార్గంలోకి వస్తాడు. అప్పుడు ఆత్మవిచారణ మొదలువుతుంది.

ఆనందము అనేది అసలు ఎక్కడ ఉంది? బాహ్య పదార్థ ములలో ఉందా? బాహ్య విషయములలో ఆనందం ఉంది అనుకుంటే ఆ ప్రయోగం విఫలమైంది కదా! విషయానందం - అంటే విషయముల యొక్క అనుభవం వల్ల వచ్చేటటువంటి ఆనందం లేదా కనిపించేటటువంటి ఆనందం - బ్రహ్మానందంలో ఎంత? లేశ మాత్రమే అని గమనానికి వస్తుంది. అలాగే లలిత కళోపాసన చేసేవారికి కూడా రసానందం వలన బ్రహ్మానంద సహోదర స్థితి కలిగినప్పటికీ అది శాశ్వతము కాదు. సంగీతం ద్వారా గాని, కవిత్వం ద్వారా గాని, చిత్రలేఖనము ద్వారా గాని మరి ఏ ఇతర లలితకళల ద్వారా గాని శాశ్వతానందము పొందలేము అనే విషయం గమనానికి వస్తుంది.

అంతట గురువు యొక్క ఉపదేశాన్ని గ్రహించి, యోగ్యతను సంపాదించినప్పుడు ఆనందం అనేది ఎక్కడో లేదు నాలోనే ఉంది, నేను ఆనంద స్వరూపుడను అని అర్థమవుతుంది. ఇలా గమనానికి వచ్చేలాగా లోపల ఉన్న జీవుని వేదన, తహతహ ముందుకు నడిపిస్తూ ఉంటుంది.

ఉదాహరణగా చెప్పాలంటే ఎండిన ఎముక ముక్క దొరికిన ఒక కుక్క దానిని నములుతూ, నమలడం వల్ల నోటిలో నుండి నెత్తురు కారుతుంటే "ఆహా! ఎముక ముక్క ఎంత బాగుంది? ఎంత రుచిగా ఉంది" అనుకున్నట్లుగా బాహ్య విషయములలో ప్రవర్తించే మనసుతో జీవుడు, ఆనందం బాహ్య విషయాలలో ఉంది అనుకుంటాడు. అది కాదని తరువాత తెలుస్తుంది. కస్తూరి మృగము తనలోని వాసనను గ్రహించలేక, ఈ వాసన ఎక్కడి నుండి వస్తున్నదో అని చుట్టూ తిరిగినట్లు జీవుడు అనేక రకాలుగా పరిభ్రమించి, ఎన్నో త్రోవలు తొక్కి చివరకు గురువును ఆశ్రయించి ఆనంద స్వరూపము తానే అని తెలుసుకుంటాడు. ఆనంద స్థానమైన పరమాత్మలో లీనం అవుతాడు. పరమాత్మయే తాను అన్న అనుభవాన్ని పొందుతాడు. నిత్యసిద్ధమై ఉన్న తన స్వరూపాన్ని తిరిగి పొందుతాడు. అంటే మరచిపోయిన తన స్వరూపాన్ని గుర్తించి, అది గానే ఉంటాడు. ఇది భగవాన్ శ్రీ రమణమహర్షి యొక్క మాటల సారాంశము.

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

మా అల్లుడుగారు ఉత్తరము రాసిన వెంటనే జ్వరము తగ్గి పోయిందని నాకు తరువాత తెలిసినది. ప్రసాదంతో పాటు నేను పంపిన ఉత్తరము, బస్సు కండక్టరు, పొరపాటున కాంచీపురము వచ్చేదారిలో ఒక నదిలో పడవేశాడట. కానీ దానిని ఎవరో గమనించి, మా అల్లుడు గారికి తీసుకువెళ్ళి ఇచ్చారు. ఉత్తరము నీళ్ళతో తడిసి చదవడానికి పనికి రాలేదు కానీ, ప్రసాదము చెక్కు చెదరలేదట.

30 సంవత్సరాలుగా నేను ఉద్యోగము చేస్తూ నివసిస్తున్న చిత్తూరు నుండి మకాము ఎత్తేసి, ఆశ్రమంలో స్థిర నివాసిగా వుండటానికి శ్రీ భగవాన్ అన్ని అవకాశాలూ కల్పించారని ఇంతకు ముందు రాసి ఉన్నాను. వీటిలో ఒకటి మా పెద్దమ్మాయి ఉద్యోగము. ఆమె వివాహము విషాదముగా ముగిసినందున, 1927 నుండి నాతోనే ఉండేది - తనకు పెళ్ళైన రెండు సంవత్సరాల నుండీ. ఆమెకు వెల్లూరులో ఒక పాఠశాలలో ఉపాధ్యాయినిగా ఉద్యోగము దొరికింది. ఇది శ్రీ భగవాన్ కృప అనే తలుస్తాను నేను. ఈ ఏర్పాటు జరగకపోతే, నేను 1942లో ఆశ్రమానికి వెళ్ళి వుండలేక పోయేవాడిని. వెల్లూరులో మా అమ్మాయి చక్కగా స్థిరపడిందనుకుంటుంటే, ఆ పట్టణ నివాసి ఐన నా సోదరుడొకడు నాకు కొన్ని విషయాలు తెలియపరిచాడు. అవి విన్నాక, అమ్మాయిని వెల్లూరు పంపించడం సరియైనదికాదేమోననీ, అది చాలా

అనర్థాలకు దారి తీస్తుందేమోననీ నాకు భయం వేసింది. ఈ ఉత్తరం నా చేతికి వచ్చేముందే నేను శ్రీ భగవాన్ దగ్గరకు వెడుతూ ఉన్నాను. మానసికంగా నేను శ్రీ భగవాన్‌తో మొరపెట్టుకున్నాను. "భగవాన్! తమ దగ్గరకు వచ్చి వుండటానికి తమరు అన్ని వసతులూ సమకూర్చారని నేను సంతోషపడుతుంటే మధ్యలో ఈ బాధ ఏమిటి? నాకిక మనశ్శాంతి వుండదా?" ఈ సంఘటన తరువాత, ఒక్క నెల రోజులలోనే, వెల్లూరులో మా అమ్మాయి పరిస్థితులు మార్చివేసి చక్కదిద్దారు. మా సోదరుడు తెలిపిన భయాలన్నీ నా మనస్సు నుండి మటుమాయమయ్యాయి. హఠాత్తుగా జరిగిన ఈ పరిణామము అనూహ్యము, తిరుగులేనిది! ఇది కేవలమూ శ్రీ భగవాన్ కరుణ తప్ప వేరొకటికాదు.

ఆశ్రమంలో నేను స్థిరపడటానికి శ్రీ భగవాన్ చేసిన ఇంకొక సహాయము గురించి కూడా చెప్పాలి. నా చిన్నప్పటినుండీ, అంటే నాకు ఐదవ సంవత్సరమునుండీ, నేను చర్మవ్యాధితో బాధపడే వాడిని. అప్పుడప్పుడు ఆ వ్యాధి ప్రకోపిస్తూ వుండేది. నాకు యుక్త వయస్సు వచ్చినప్పుడూ, ఆ తరువాత కూడా,ఈ వ్యాధి వల్ల చాలా ఖర్చు అయ్యేది. చాలా బాధపడేవాడిని కూడా! అది ఒక రకమయిన తామర/గజ్జి వంటిది. పాదాల మీద కనిపించి, మోకాళ్ళ వరకూ పాకేది. ఆ వ్యాధిని ఆటగాళ్ళ పాదము (Athelete's foot) అని అనేవాళ్ళు. ఒక్కోసారి చేతి మీదకు కూడా వచ్చి, వేళ్ళు, ముంజేయి అంతా కప్పి వేసేది. నాకు ముప్పై సంవత్సరాలు వచ్చిన దగ్గరనుండి ఇంకా ముందేమో కూడా - అనేక రకాల మందులు మింగేవాడిని.

వాడిన ఆయింట్‌మెంట్లకు అంతులేదు. కానీ ఆ వ్యాధి చాలా మొండిదై కూర్చుంది. కొన్ని మందులతో కొంత ఉపశమనము కలిగినా, 1940 దాకా శాశ్వత పరిష్కారము లభించలేదు.

ఈ వ్యాధితో ఆశ్రమ నివాసము ఎంత కష్టమో ఊహించుకోవచ్చును. రాత్రి పడుకునే దాకా భక్తులతో కలిసి జీవించాల్సిన పరిస్థితి ఐనప్పుడు, చేతుల మీదా, కాళ్ళమీదా ఈ తామర పొక్కులతోనూ, ఆయింటుమెంట్లతోనూ ఉండటం చాలా ఇబ్బందికరమైన విషయం. అందువలన, అనేకసార్లు శ్రీ భగవాన్ ముందు సాష్టాంగ నమస్కారము చేసుకునేటప్పుడు, శ్రీ భగవాన్ ఈ వ్యాధి నుండి నన్ను విముక్తుడను చేసే మార్గము చూపించాలనే ఆలోచన నాకు పొడగట్టేది. ఈ వ్యాధి తగ్గితే కానీ ఆశ్రమంలో స్థిరనివాసం ఏర్పరచుకోకూడదు అని కాదు నా ఉద్దేశము. బిడ్డ తండ్రి దగ్గర ఎలా మారాము చేసి ఏడుస్తాడో, శ్రీ భగవాన్ దగ్గర ఎల్లప్పుడూ నా ప్రవర్తన అలాగే ఉండేది. నా మనఃస్థితికి ఆ పద్ధతే నాకు సరియైనదిగా వుండేది. నా మనోగతం ఇలా ఉండేది. ‘‘భగవాన్! నా సంగతి మీకే తెలుసు. నాకెప్పుడూ శుభ్రంగా ఉండటం, చక్కగా తయారవడం అలవాటు. ఇంట్లో నా గదిలో ఒక్కడినే ఉన్నప్పుడు కూడా - ఇతరులు ఎవ్వరూ లేకపోయినా - నా పద్ధతి అదే! అశుభ్రంగా, చింకిరిగా కనిపించడం నాకిష్టముండదు. ఈ వ్యాధి నన్ను బాధిస్తుంటే రోజూ మీ దగ్గరకు, అంతమంది భక్తుల మధ్యకు ఎలా రాగలను చెప్పండి?’’

(సశేషం)

# శ్రీ భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు

(గత సంచిక తరువాయి) శ్రీ వెంకట్రామశర్మ

ఆశ్రమం తరపున ఆయన కొండ మీదకి వెళ్తూ ఉంటే నేను కూడా ఆయనతో వెళ్లాను. అదే వ్యక్తి ఇప్పుడు గొడుగు తీసుకొని ఆశ్రమం బయటకు వెళ్ళటం గమనించాను. ఆయన కూడా గిరి ప్రదక్షిణకు వెళ్తున్నాడని అనిపించింది. దాంతో భగవాన్ అనుజ్ఞ ఇచ్చారని అనుకొని ఆయన వెనుకనే దాదాపు ఒక 200 అడుగుల దూరంలో నేను నడక ప్రారంభించాను. ఆయనకు నేను బాగా తెలిసినా, ఆయనతో నేనేమీ మాట్లాడలేదు. ఆశ్చర్యకరమైన విషయ మేమిటంటే నేను నడుస్తున్న చోటికి అల్లంత దూరంలో వర్షం పడుతూ ఉంటుంది. కానీ, నేనక్కడికి చేరేటప్పటికే వర్షం తగ్గి పోతుంది. నేను గిరి ప్రదక్షిణ పూర్తి చేసే వరకు కూడా ఇలానే పడుతూ ఉంది. నేను బస్ స్టాండు దగ్గరకి వచ్చే వరకూ అలానే జరిగింది. నేను బస్ స్టాండుకు వచ్చేటప్పటికి తెల్లవారు జామున 3 గంటలయింది. నేనక్కడికి వచ్చేటప్పటికే మద్రాస్ వెళ్ళవలసిన సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ బస్సు ఇంకొక 5 నిమిషాలలో బయలు దేరటానికి సిద్ధంగా ఉన్నది. అది ఉదయం 6.30 గంటలకల్లా మద్రాస్ చేరుతుంది. ఇంకొక ఐదు నిమిషాలు ఉన్నది కదా, అని అనుకొని నాకు గిరి ప్రదక్షిణలో ముందుగా నడిచిన వ్యక్తికి కృతజ్ఞతలు తెలుపుదామని బయటకు వచ్చి చూస్తే ఒక కిలోమీటర్ వరకూ కూడా ఏ వ్యక్తి కనపడలేదు. నేను ఆ తరువాత మద్రాస్ వచ్చేశాను. ఆ తరువాత తెలిసిందేమిటంటే ఆ వ్యక్తి ఆ సమయంలో

ఎప్పుడూ ప్రదక్షిణ చేయలేదని ఆశ్రమంలో వున్న వారు తెలియ చేశారు. దాంతో భగవానే నాకు సహాయపడటానికి ఆ రూపంలో వచ్చారని అర్థమయింది. ఇటువంటి సంఘటనలు నా జీవితంలో ఎన్నో జరిగాయి.

ఆ తరువాత ఒకానొక సమయంలో నాలో ఒక ప్రశ్న ఉదయించింది. నా సాధనలో అంటే ఆత్మ సాక్షాత్కారానికి అరుణాచలేశ్వరుడి నుండి సహాయాన్ని తీసుకోవాలా లేక భగవాన్ నుండి తీసుకోవాలా అని అనిపించింది. దానికి సమాధానం ఒక రోజు ఇలా వచ్చింది. మనకు అరుణాచలం తెలిసిందంటే దానికి కారణం శ్రీ భగవాన్ కనుక, భగవాన్నే ఆశ్రయించాలని. నాకప్పుడూ ఎలా అనిపించేదంటే, ఎల్లప్పుడూ భగవాన్ నాతోనే వున్నారని. ఉదాహరణకు ఉద్యోగానికి సంబంధించిన ఒకానొక ముఖ్యమైన పనిని మరుసటి రోజుకల్లా చేయాలనుకొంటే అది మానవ మాత్రునికి అసంభవమైనది, మరుసటి రోజుకు ఆ పని జరగక పోవచ్చు అని అనుకొంటే అది జరిగి పోయేది. బెంగుళూర్‌లో ఉన్న ఒక వ్యక్తితో మాట్లాడాలనుకొంటే ఫోన్లో మాట్లాడినా ఆ పని జరగక పోవచ్చు. అటువంటిది ఏ వ్యక్తి ద్వారా ఐతే ఆ పని జరగాలో ఆ వ్యక్తి మరుసటి రోజు నా వద్దకు వచ్చేవారు. శ్రీరామకృష్ణులకు అమ్మవారు వెనుక ఉండి మాట్లాడిస్తున్నట్లు, నాకు కూడా భగవాన్ నా వెనుక ఉండి నడిపిస్తున్నట్లు అనిపిస్తోంది. నా అవసరాలన్నీ భగవానే చూసుకొంటున్నట్లు నాకు తెలుస్తూ వున్నది.

ఏదైతే ఒక ఉత్సుకతలా మొదలైనదో, అది ఒక స్నేహంలా మారింది. భగవాన్ నాకొక సన్నిహితమైన వ్యక్తి అని, నేను భగవాన్

దగ్గరకు వెళ్ళాలంటే ఎటువంటి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని, నా ఇంటికి నేను వెళ్ళటానికి అనుమతి అవసర మేమిటని నాకనిపిస్తుంది. నేను ఆశ్రమానికి వెళ్ళట్లేదు, భగవాన్‌ను కలవటానికి వెళ్తున్నాను అని అనుకొనే వాడిని. మన వాళ్ళ దగ్గరకు వెళ్ళటానికి మనకు అనుమతి అవసరమా? అలానే ఇదీనూ. భగవానే నా గురువని నాకు అనిపించేది. భగవాన్ ఏదో బయటి వ్యక్తని నేనేదో నమస్కారాలు పెట్టాలని నాకెప్పుడూ అన్పించేది కాదు. భగవాన్ నావాడు, నా శ్రేయోభిలాషి, స్నేహితుడు, మార్గ నిర్దేశకుడు, గురువు అని అనుకొనే వాణ్ని, నేను భగవాన్‌తో ఇలా మాట్లాడేవాడిని : అందరూ ఏదైతే భగవంతుడని, బ్రహ్మమని, ఆత్మ అని మాట్లాడుతున్నారో అదేమిటో నువ్వే చెప్పాలని అనేవాణ్ణి. ఇంకెవరి నుండో తెలుసుకోవాలని లేదు అని చెప్పేవాడిని. అదీ ఎందుకంటే, ఆత్మను గురించి నీకు తెలుసు కనుక అని అనేవాణ్ణి. అది కూడా నాకు అర్థమయ్యే భాషలో చెప్పాలి అని అనేవాణ్ణి. అదీ నాకు భగవాన్‌కు ఉన్న అనుబంధం. నేనెప్పుడైనా ఇబ్బందులలో ఉన్నప్పుడు, భగవాన్‌ను అడగటం అనే కంటే, భగవాన్‌ను తలచుకోగానే ఇబ్బందులు తీరిపోయేవి. నా జీవితంలో ఎన్నో సందర్భాలలో భగవాన్ నాకు సహాయం చేశారు. కాలక్రమేణా భగవాన్ మా కుటుంబంలో ఒక సభ్యులైనారు అని నాకనిపిస్తుంది. నాకెలా అనిపించేదంటే, నేనొక చక్రవర్తిని కలవటానికి వెళ్తున్నాను, కాబట్టి మిగిలిన వాళ్ళను గురించి తెలుసుకోవలసిన అవసరం నాకు లేదని అనిపించేది. ఇదే విషయాన్ని శ్రీరామకృష్ణ పరమహంస ఇలా అనేవారు. మామిడి తోట యొక్క యజమాని తెలిస్తే, తోటలో

ఉన్న ఏ పండైనా తీసుకోవచ్చు, అని, తోటలో పనిచేస్తున్న వారిని అడగనక్కర్లేదు అని. భగవాన్ గురువు కాబట్టి, నాకు ఆత్మను గురించి తెలియచేయాల్సిందే అని అనుకొనేవాడిని.

ఈ భువనమంతా పరబ్రహ్మము అనే సాగరములో ఒక తరంగము లాంటిదని ఒక శ్లోకంలో చెప్పబడింది. భగవాన్ వద్దకు వచ్చిన వారందరిలో ఎక్కువ శాతం మంది అభిప్రాయం ప్రకారం మేము భగవాన్ దగ్గరకు రాలేదు, భగవానే మమ్మల్ని వారి దగ్గరకు రప్పించుకొన్నారు అని వింటూ ఉంటాం. కానీ ఇక్కడ ఒక మిలియన్ డాలర్ ప్రశ్న ఉన్నది. అదేమిటంటే 'నేను' భగవాన్ కంటే అన్యంగా ఉన్నానా? నేను భగవాన్ కంటే అన్యంగా ఉండటానికి ఆస్కారమున్నదా? 'నేను', చైతన్యము మరియు ఉనికి కంటే అన్యంగా ఉండగలనా? 'నేను' యొక్క ఉనికి ఏ ఆధారాన్ని ఆసరా చేసుకొని మనగలుగుతున్నదో, దానికి అన్యంగా ఉండటం కుదురుతుందా? దేనిని ఆధారం చేసుకొని అన్నింటి యొక్క ఉనికి ఉన్నదో అటువంటి దానికి అన్యంగా ఇంకొక ఉనికి ఉంటుందా? అలా జరిగే అవకాశమే లేదు కదా. ఒకవేళ ఏదైనా ఒక దానికి ఆ సద్వస్తువు కంటే భిన్నంగా ఉనికి ఉన్నదని అంటే, అది సద్వస్తువు నుండి తొలగివేయబడుతుంది. ఒకవేళ కనుక ఈ ఆలోచన ఊహ కందనిది అని అనుకొంటే ఇక్కడ ఒక ఉదాహరణను గమనిద్దాం.

అరుణాచలం కొండ ఒక అయస్కాంత శక్తి క్షేత్రం అని, అది అన్ని జీవాలను తనవైపునకు ఆకర్షిస్తోందని అంటారు. అంటే ఇక్కడ ఇనుపరజను అయస్కాంతం దగ్గరికి వెళ్ళట్లేదు. అయస్కాంతం

ఇనుపరజనును తన వైపునకు ఆకర్షిస్తున్నది. ఈ ఉదాహరణను గమనించినప్పుడు, ఇక్కడ మరో ప్రశ్న మనలో తలెత్తుతుంది. అదేమిటంటే ఏదేని ఒకటి తనకన్నా ఇతరంగా ఉన్న దానిని తన వైపునకు ఆకర్షిస్తుందా? ఇంకొక ఉదాహరణగా దీన్ని గమనిద్దాం. నూనె నీళ్ళతో కలుస్తుందా? కలవదు కదా. అలానే ఎవరైనా నేను భగవాన్ వద్దకు రాలేదు, భగవానే నన్ను వారి దగ్గరకి రప్పించు కొన్నారు అని ప్రారంభంలో అనుకొన్నా అంతిమంగా వారు భగవాన్ కంటే అన్యంగా లేరని తెలుసుకొంటారు. ప్రారంభంలో భగవాన్‌ను చేరుకోవాలని అనుకొన్నా, ప్రతీ ఒక్కరు భగవాన్‌ను చేరుకొన్న తరువాత అందరూ భగవాన్‌లో భాగమే అని తెలుసుకొంటారు. ఇది నా అనుభవం. అది స్పష్టంగా నా అవగాహనలోకి వచ్చిందని నేననుకొంటున్నాను. ఏ క్షణానైతే ఇనుపరజను అయస్కాంత క్షేత్రంలోకి వెళ్లిందో, అప్పుడే ఇనుపరజను ఆయస్కాంతంగా మారినట్టే. అలానే ఏ క్షణానైతే భగవాన్ దృష్టి మన మీద ప్రసరించిందో ఆ క్షణానే మనం భగవాన్‌లో ఐక్యమైనట్టే. దీన్ని అర్థం చేసుకోవటానికి మనం ఇంకొక ఉదాహరణని తీసుకొందాం. సూర్యుడి వెలుతురు ఉన్నదనుకొంటే, సూర్యునికి ఎదురుగా నిల్చొనగానే వెలుతురు వస్తుంది. సూర్యునికీ, సూర్యుని వెలుతురికీ మధ్య సమయాభావం ఉండదు. ఇనుపరజనుకు తెలియక పోవచ్చు, ఇనుపరజను అయస్కాంతం వైపునకు కదులుతోందని అనుకోవచ్చు. అలానే మనం కూడా యేమాత్రం సమయం దొరికినా ఎంతో కష్టపడి అరుణాచలానికి చేరుకొంటున్నామని అనుకొంటూ వుంటాం. కానీ నాకర్థమైనంత వరకూ భగవాన్ మార్గంలోకి ఒక

జీవుడు రావటం అంటేనే అది ఆ జీవుని యాత్రకు ఆది మరియు అంతము అని. భగవాన్ వద్దకు రావటమంటే, నేను భగవాన్ కంటే అన్యంగా లేను అని తెలుసుకోవటం. అదెలా అంటే నేననుకోవచ్చు, నేను తీసుకొంటున్న ఆహారం నా కంటే అన్యంగా ఉన్నదని, నేను తీసుకొంటున్న నీరు నాకంటే అన్యంగా ఉన్నదని, నేను తీసుకొంటున్న గాలి నాకంటే అన్యంగా ఉన్నదని, కానీ ఆ ఆహారం (అంటే తీసుకొనే పదార్థం కావచ్చు, నీరు కావచ్చు, పీల్చే గాలి కావచ్చు) లేకుండా నేనెలా లేనో, అలా ఈవేళ నేను ఇలా ఉన్నానంటే అది కేవలం భగవాన్ అనుగ్రహం వల్లనే.

నాకు సిగరెట్లు తాగే అలవాటు ఉండేది. ఒకప్పుడు చాలా సిగరెట్లు త్రాగేవాడిని. అలా ఒకసారి ఆశ్రమానికి వెళ్ళినప్పుడు కూడా నేనున్న గదిలో, త్రాగకూడదు అని తెలిసినా, నా బలహీనత వల్ల అక్కడ సిగరెట్ త్రాగాను. ఎక్కడైతే నాకు గది నిచ్చారో ఆ గదిలో గొప్ప గొప్ప భక్తులు అందులో నివసించారు. అలా సిగరెట్ త్రాగిన 10 రోజులకే నేను హాస్పిటల్ పాలయ్యాను. రెండు, మూడు రోజులకే నాకు శ్వాసకోసకు సంబంధించిన సమస్య ఎదురైంది. డాక్టర్లు నన్ను పరీక్షించిన తరువాత నా పరిస్థితి ఏమీ బాగోలేదని, ప్రార్థనలు ఒక్కటే నన్ను రక్షించే అవకాశం ఉన్నదనీ మా వాళ్ళతో చెప్పారు. నన్ను వెంటిలేటర్ మీద ఉంచారు. నాకు తెలిసి నేనొక్కడినే అలా 15 రోజులు వెంటిలేటర్ మీద వుండి బ్రతికిన వ్యక్తిని అని తరువాత తెలిసింది. ఆ సమయంలో, మా బావమరిది ఒకరు విద్యానగర్ మీదుగా వస్తూ, గాంధీ శతాబ్ది హాలులో జరుగుతున్న శ్రీరమణ సత్సంగంలో పాల్గొన్నప్పుడు ఎవరో వచ్చి

మా బావమరిదికి శ్రీ భగవాన్ ఫోటోను, విభూతిని, కుంకుమను ప్రసాదంగా ఇచ్చారట. అవి తీసుకు వచ్చి నా నుదిటిన కుంకుమ, విభూతి పెట్టి నా తలగడ క్రింద భగవాన్ ఫోటో వుంచారట. ఆ రోజు నుండి నేను కోలుకున్నానని ఆ తరువాత మా వాళ్ళు చెప్పారు. నాకిప్పుడనిపిస్తోంది, ఇలా నేను బయటపడ గలగటం డా. కే.యస్. గారి అనుగ్రహమేమోనని. ఈ సంఘటన 1990లో జరిగింది. నేనలా హాస్పిటల్‌లో ఉన్నప్పుడు అక్షరమణమాలను తెలుగులోనూ, తమిళంలోనూ నిరంతరాయంగా వింటూ ఉండే వాడిని. అలానే కొన్ని పాటలు భగవాన్ మీద పాడినవీ వినేవాడిని. నేను పూర్వ జన్మలో శ్రీరమణాశ్రమంలో ఉన్నానేమో అని ఒక్కొక్కసారి అనిపిస్తుంది.

## హైద్రాబాద్ కేంద్రంతో నా అనుబంధం

నా కూతురు హోమియోపతి డాక్టర్‌గా పని చేసేది. తను 2008వ సంవత్సరంలో శరీరాన్ని చాలించటంతో నా శ్రీమతి మనో నిబ్బరాన్ని కోల్పోయి, ఒక రాయిలా తయారయింది. 2009 లోనో 2010లోనో ఒకసారి పని మీద వేల్పూరుకు వెళ్ళాల్సి వచ్చింది. నేనెవరితో వెళ్ళానో ఆ వ్యక్తితో ఇక్కడ ఏదైనా ఆశ్రమం లాంటిది కానీ లేదా ఎవరైనా మహాత్ములు ఉన్నారా అని అడిగాను. దానికి అతను వేల్పూరు స్వామి అని ఒకరున్నారు అని చెప్పారు. వీరిని గురించి అంతకు మునుపు చాలా కాలం క్రితం ఇంకొకరి ద్వారా విని వున్నాను. దాంతో ఆ ఆశ్రమానికి వెళ్లి ఆ రాత్రికి అక్కడ ఉన్నాను. ఆ ఆశ్రమంలో సంపత్ అనే ఒక వ్యక్తిని కలవటం జరిగింది. వారితో మాట్లాడుతున్నప్పుడు మాటలలో వారు

హైద్రాబాద్‌లోని శ్రీరమణ కేంద్రం గురించి, డా. కే.యస్.గారిని గురించి చెప్పారు. వారు డా. కే.యస్. గారి సన్నిధిలో ఎంతో గొప్ప ప్రశాంతతను పొందినట్లు తెలిపారు. వారికి డా. కే.యస్. గారి సన్నిధిలో ఎన్నో గొప్ప ఆధ్యాత్మిక అనుభూతులు కలిగాయని చెప్పారు. శ్రీరమణ కేంద్రాన్ని దర్శించాల్సిన ప్రదేశంగా నాకు నొక్కి మరీ చెప్పారు. మీకు మంచి అనుభవం కలుగుతుందని కూడా చెప్పారు. కానీ నేను పెద్దగా పట్టించుకోలేదు. అలానే డా. కే.యస్. గారింట్లో ఇప్పటికీ సత్సంగాలు జరుగుతాయని అక్కడకు కూడా వెళ్ళవచ్చని చెప్పినా నేను పట్టించుకోలేదు. నాకు భగవాన్‌తో అనుబంధం ఉండగా నేనెవరో x, y, z దగ్గరకు ఎందుకు వెళ్లాలని అనిపించింది. ఆ తర్వాత నేను, నా శ్రీమతిని వేల్పూరు ఆశ్రమానికి తీసుకొని వెళ్ళినప్పుడు, నా శ్రీమతికి అప్పటి వరకూ ఉన్న భారం చాలా వరకూ తగ్గిపోయినట్లు, ఎంతో ప్రశాంతతను పొందినదట. మేమొకసారి విక్రంపురిలో ఉంటున్న మా బంధువుల ఇంట్లో జరిగే ఒక శుభకార్యానికి వెళ్ళవలసి వచ్చింది. మేమక్కడికి వెళ్ళే సరికి ఆ కార్యక్రమం ఇంకా మొదలు కాలేదు. ఇంకా కొంత సమయం పడుతుందని తెలుసుకొని, సంపత్‌గారు చెప్పిన విషయం గుర్తుకు రావటంతో డా. కే.యస్. గారిల్లు ఎక్కడ ఉన్నదా అని వెదకటం మొదలుపెట్టాం. ఆ రోజు శుక్రవారం అవటంతో వారింట్లో సత్సంగానికి భక్తులు వస్తూ ఉండేవారు. మేమలా వెదుకుతూ ఉన్నప్పుడు అటుగా ఒకరు వచ్చారు. వారిని డా. కే.యస్. గారిల్లెక్కడా అని అడిగితే వారు నేనక్కడికే వెళ్తున్నాను. మీరు నాతో రండని తీసుకొని వెళ్ళారు. అలా తీసుకొని వెళ్ళిన వారు శ్రీ

కృత్తివాసన్ గారని తరువాత తెలిసింది. ఆ సత్సంగంలో పాల్గొన్న తరువాత నా శ్రీమతిలో ఇంకా కొంచెం మిగిలి ఉన్న మానసిక భారం పూర్తిగా తొలగిపోయినట్లు గుర్తించింది. ఇది 2013-14 ప్రాంతాలలో జరిగిందని అనుకొంటాను. ఆ తరువాత ఎన్నోసార్లు డా. కే.యస్. గారింటికి శుక్రవారం సత్సంగంలో పాల్గొనటానికి వెళ్ళాము.

నేను 2000వ సంవత్సరంలో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి నా మిగిలివున్న జీవితాన్ని పూర్తిగా నా ఆధ్యాత్మిక సాధనలో గడపాలని నిర్ణయించుకొన్నాను. 2008లో నా కూతురు శరీరం చాలించిన తరువాత నా కంటి చూపు కూడా తగ్గిపోవటంతో నేనింకా సీరియస్‌గా సాధన చేయటం మొదలు పెట్టాను. దానర్థం నాకేదో మోక్షం కావాలని కాదు కానీ, ఆత్మ సాక్షాత్కారానికి ఉన్న మెకానిజం ఏంటో తెలుసుకోవాలని అనుకొన్నాను. ఆ సమయంలో నాకు సాధనలో ఒక సపోర్ట్ ఉంటే బాగుంటుందని అనుకొని శ్రీరమణ కేంద్రం రావాలని అనుకొన్నాను. ఇంకా చెప్పాలంటే ఆధ్యాత్మిక సాధనలో నేనెందుకు ఇంకొకరి సహాయం తీసుకో కూడదు అని అనుకొన్నాను. కానీ ఈ విషయంలో భగవాన్ నుండి ఎటువంటి సహాయం తీసుకోకూడదు అన్న మూర్ఖపు అహంకారం ఉండేది. ఆయనను ఎందుకు అడగాలి? నా అంతట నేను తెలుసుకోలేనా? నేను ఆ మాత్రం అర్థం చేసుకోలేనా? ఇది కూడా చెప్పు అని ఆయనను అడగాలా? అనే కొంత పిచ్చి అహంకారం నాలో ఉండేది. భగవాన్ కూడా మనలాంటి మనిషి అని అనుకొనే వాడిని. నువ్వు నాకు చెప్పు అని నేను భగవాన్‌ను అడిగే వాడిని కాదు.

నేను నా తెలివితేటల మీద ఆధారపడేవాడిని. కొంతకాలం తరువాత నేను ఇంకొకరి సహాయం తీసుకోవాలని అన్పించింది. చూడండి మనసు ఎలా మారిపోతోందో? దాంతో కేంద్రం నుండైనా లేక ఇంకా ఎవరి ద్వారా నైనా సహాయం తీసుకోవాలని అనుకొన్నాను. భగవాన్ నుండి మాత్రం తీసుకోకూడదు. ఆయన నుండే ఎందుకు సహాయం తీసుకోవాలి? అనే అహంకారం చాలా ఉండేది. నా శ్రీమతికి కలిగిన అనుభవం కూడా నేను కేంద్రం రావటానికి తోడ్పడింది అని అనుకుంటున్నాను. అలా నేను కేంద్రం రావటం మొదలు పెట్టాను. ఆ తరువాత శ్రీరాఘవేందర్‌గారి నుండి డా. కే.యస్. గారి ప్రవచనాల క్యాసెట్లను తీసుకొన్నాను. అవి విన్న తరువాత డా. కే.యస్. గారు మామూలు వ్యక్తి కాదని, మహాత్ములని అర్థం చేసుకొని, ఆయనకు ఏదో కొంత తెలుసు అని నాకన్పించింది. హైద్రాబాద్‌లో, వారు శ్రీ భగవాన్ యొక్క స్థానిక ప్రతినిధి అని అనుకొన్నాను. వారిని నేను చూడక పోయినా, వారు మనకు సహాయ పడగలరని నా మనసులో ధృఢంగా అన్పించింది. భగవాన్ ఏం తెలియ చేసారో అది డా. కే.యస్. గారికి తెలుసని నాకనిపించింది. డా. కే.యస్. గారి యందు మాకంటే ఎక్కువగా మీకే అధికమైన విశ్వాసం వున్నట్లు మాకనిపిస్తోందని శ్రీ కృత్తివాసన్ గారు, శ్రీ రాఘవేందర్ గారు అనేవారు. అదంతా నాకు తెలియదు కానీ, భగవాన్ ఏం చెప్పారో అది డా.కే.యస్. గారికి తెలుసునని, వారు దాన్ని అర్థం చేసుకొన్నారని నాకన్పించింది. శ్రీరమణ కేంద్రం, సాధకులందరికీ ఒక గొప్ప సపోర్ట్ ఇస్తోందనే భావన నాకు కలిగింది.

నేను కేంద్రానికి వచ్చిన తరువాత కూడా, నాకేమి తెలియక

పోయినా, నాకంతా తెలుసు అనే భావనలో ఉండే వాణ్ని, ఈ కేంద్రానికి వచ్చిన తరువాత ఆధ్యాత్మికంగా నాకున్న కొన్ని ప్రశ్నలకు సమాధానాలు దొరికాయి. దాని తరువాత నా ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఈ కేంద్రం నాకు సహాయ పడుతోందని నాకు అన్పించింది. ఇప్పుడు నాలుగైదు సంవత్సరాల నుండి నేను ఉపనిషత్తులలో ఏం చెప్పారో అర్థం చేసుకొనే ప్రయత్నం చేస్తున్నాను. భగవాన్ చెప్పిన దాన్ని ఉపనిషత్తులలో చెప్పిన దానితో పోల్చి చూస్తున్నాను. ఉపనిషత్తులలో చెప్పిన దానికి అన్యంగా భగవాన్ ఏమైనా చెప్పారా అని చూస్తున్నాను. నాకిప్పటి వరకూ అటువంటిదేమీ తారసపడలేదు. నిజం చెప్పాలంటే నాకిప్పటికీ శ్రీ భగవాన్ ఏం తెలియ చేసారో లేదా ఏం చెప్పారో నాకు అర్థం కాలేదు.

నేనొకసారి ఆశ్రమానికి వెళ్లినప్పుడు బలరామ రెడ్డిగారిని కలవటం జరిగింది. వారిని కలిసినప్పుడు భగవాన్ గురించి రెండు మాటలేవైనా చెప్పండి అని అన్నప్పుడు, వారు, "మీరు అంతా చదివానన్నారు కదా! ఇంకా నేను చెప్పేదేమున్నది?" అని అన్నారు. నేను చదివాను కానీ మీరు భగవాన్ సన్నిధిలో వున్నారు కాబట్టి ఏవైనా రెండు మాటలు మీ ముఖతః వినాలని ఉన్నది అని అన్నాను. రెండు నిమిషాల మౌనం తరువాత వారిలా అన్నారు. "వేదాలలో, ఉపనిషత్తులలో బ్రహ్మమును గురించి వివరించారు కదా! దానికి మానవాకారమిస్తే అదే శ్రీ భగవాన్" అని అన్నారు. ఆ మాట చెప్పిన తరువాత నాకింక ఏ ప్రశ్న అడగాలని అన్పించలేదు. ఆ సమయంలో నేను ఆ సమాధానంతో తృప్తి చెంది వెనుదిరిగాను.

# Observing Every Breath You Take

Talk 56

Dr. K. Subrahmanian

We realize the happiness we enjoy in deep sleep only when we wake up. We are able to talk about this happiness only when we wake up, but we are unable to experience the joy when we are asleep. In our waking state, we are conscious of the things that happen because when we are awake, we are governed by reason. As the mind is very active during this period, we are able to do a variety of things from morning to evening. Hence, we believe the waking state is real, and the other state - sleeping - is unreal. But is this true?

What happens when a child puts his finger in the door hinge and someone accidently slams the door shut? The child's finger is crushed, and he begins to cry. What do we do in such circumstances? If the child is very small, we try to pacify him by beating the door really hard several times. While doing so, we tell the child, "I'm punishing the door that has hurt you!" When he sees that something is being done to the door, which he thinks is responsible for harming him, he stops crying. In fact, after some time, the child forgets about his pain and may even start laughing. Now, what is real here? As far as the child is concerned, you are punishing the door for hurting him. As far as you are concerned, you know fully well that an inanimate object like a door cannot be punished. You pretend to hit the door in order to satisfy the child. As far as the child is concerned, your actions are real - you are

punishing the door.  You, on other hand know, the actions have nothing to do with reality.

We must, therefore, ask the question, what is real and what is unreal? At one level, the act of punishing the door is real, and at another level, it is unreal. For the child, the actions are real, but for you, they are not. Had the injured person been an adult, we would not have tried to pacify him by banging on the door. We, however, know that a child can be pacified in this fashion. So, there are different levels of reality - what the child considers to be real is not real, but you do what you need to in order to help him forget the pain.

Let me give you another example. Every now and then, your small child or grandchild gets on top of you and pretends you are his horse or donkey. He takes a stick, climbs on to you and then says, “Come on, move!” Next, the child says, “Move faster!” Now what happens here? As far as the child is concerned, you are a donkey. He beats you, and you don’t mind it because you are interested in the happiness of the child. You are prepared to behave like a donkey or a horse for the child’s happiness. As far as you are concerned, you know it is unreal - you are not a donkey. You are prepared to descend to the level of a donkey in order that the child might think that you are that, and you derive a lot of pleasure from it. However, if a neighbour’s child asks you to become a donkey, you refuse. You might even get upset and scold him. When it comes to your own child, however, you gladly become a donkey. There are two levels here.  You are doing it in order that the child might be happy, but the child thinks it is real and

